సాక్షి ప్రకాశం

శుక్రవారం । 12 । మే । 2023

I



సుబ్బారెడ్డి సేవలు అమూల్యం

దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి సేవలు అమూల్యమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కొనియాడారు. - IIలో..



కూలీల ఆటోను ఢీకొట్టిన కారు

కూలీల ఆటోను కారు ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కడవకుదురు గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. - IIలో..

గరిష్టం/కనిష్టం
38 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. .

న్యూస్‌రీల్

పది ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ఒంగోలు: పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమం మరియు సాధికారత అధికారి ఎస్.లక్ష్మానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. బాలురకు అర్థవీడు, వెలిగండ్ల సాంఘిక సంక్షేమశాఖ రెసిడెన్షియల్ స్కూళ్లలో, బాలికలకు చీమకుర్తి, సింగరాయకొండ, రాయవరం, కంభం సాంఘిక సంక్షేమశాఖ రెసిడెన్షియల్ స్కూళ్లలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వసతి గృహ సంక్షేమ అధికారులు పదో తరగతి ఫెయిలైన విద్యార్థులను ఈ నెల 12వ తేదీ సాయంత్రం లోపు చేర్పించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం వారికి భోజన సదుపాయం కల్పించాలన్నారు. అదే వింగా రెండురోజులకోసారి హాజరు వివరాలు కూడా పంపాలని ఆదేశించారు.

ప్రతి రైతుకూ పంట నష్టపరిహారం అందించాలి

- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలపై ఫోన్‌లో మంత్రి సురేష్ సమీక్ష

యర్రగొండపాలెం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం వ్యవసాయ శాఖాధికారులతో ఫోన్‌లో సమీక్షించారు. జేడీఏ శ్రీనివాసరావుతో మాట్లాడి పంట నష్టం వివరాలడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు నమోదు చేసిన వివరాలకు, రైతుల నుంచి వస్తున్న సమాచారానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా దెబ్బతిన్న ప్రతి పంటకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి తమకు ఫిర్యాదులు అందకూడదని, మరోసారి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని సూచించారు. రైతులతో మాట్లాడి దెబ్బతిన్న పంటల వివరాలను పూర్తిగా నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. పంట కోత దశలో ఉండి నష్టం జరిగినట్లు గుర్తించిన వివరాలపై ఆయన చర్చించారు. వ్యవసాయాధికారులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని త్రిపురాంతకం, ముండ్లమూరు, తాళ్లూరు, సీఎస్ పురం, బేస్తవారిపేట, పుల్లలచెరువు, పామూరు మండలాల్లో వరి 151.02 హెక్టార్లు, మొక్కజొన్న 20 హెక్టార్లు, పత్తి 8 హెక్టార్లు, మినుము 20 హెక్టార్లు, నువ్వులు 84 హెక్టార్ల ప్రకారం మొత్తం 283.02 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారన్నారు. ఎక్కువ శాతం పంటలు నష్టపోయినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పంటలు దెబ్బతిన్న ప్రాంతాలకు అధికారులు వెళ్లి మరోసారి వివరాలు నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

కానిస్టేబుళ్లకు ఎస్పీ ప్రశంస



కానిస్టేబుళ్లకు ప్రశంసపత్రాలు అందజేసి అభినందిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: పోలీసుల ఎస్కార్ట్ నుంచి తప్పించుకుని పారిపోతున్న నిందితులను వెంబడించి పట్టుకోవడం ద్వారా పోలీసుల ప్రతిష్ట పెంచారని ఎస్పీ మలికాగర్గ్ కానిస్టేబుళ్లను అభినందించారు. పామూరు చోరీ కేసులో నిందితులైన పీసీ పల్లి మండలం నేరేడుపల్లికి చెందిన రావూరి దుర్గారావు, మురుగుమ్మి గ్రామానికి చెందిన చేకల మహేంద్రతో పాటు హనుమంతునిపాడు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడైన కత్తి కొండయ్యలను ఒంగోలు జిల్లా జైలు నుంచి ఎస్కార్టుతో కనిగిరి కోర్టుకు ఈ నెల 9వ తేదీ హాజరు పరిచేందుకు తీసుకొచ్చారు. కత్తి కొండయ్యను కోర్టులో హాజరుపరిచిన తర్వాత మిగతా ఇద్దరు నిందితులను తీసుకెళ్లే సమయంలో నిందితులు ఎస్కార్ట్ సిబ్బందిని గట్టిగా నెట్టివేసి కోర్టు వెనుక గోడ దూకి పారిపోయారు. కనిగిరి కోర్టు ప్రాంగణం నుంచి తప్పించుకుని పారిపోతున్న ముగ్గురు నిందితులను మూడు కిలోమీటర్ల మేర వెంటాడి పట్టుకున్న సీఎస్ పురం కోర్టు కానిస్టేబుల్ రామాంజనేయులు, పీసీ పల్లి కోర్టు కానిస్టేబుల్ కె.తిరుపతినాయుడును గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. జరిగిన సంఘటన గురించి కానిస్టేబుళ్లను అడిగి తెలుసుకున్నారు. నిందితులను వెంటాడిన తీరును అడిగి విధి నిర్వహణలో వారి నిబద్ధతను మెచ్చుకున్నారు. నిందితులు రాళ్లతో దాడి చేస్తున్నా లెక్క చేయకుండా అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించారని కొనియాడారు. కానిస్టేబుళ్ల తెగువ, సమయస్ఫూర్తిని ప్రశంసించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

పుట్టుకతోనైనా, విధి వంచనైనా.. కారణమేదైనా దివ్యమైన జీవితాన్ని వైకల్యం వెంటాడుతున్న వారి జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం చైతన్యం నింపుతోంది. ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి అన్నిరంగాల్లో రాణించేలా చర్యలు తీసుకుంటోంది. మీకు అండగా ఉన్నామంటూ వారిని అక్కున చేర్చుకుంటోంది. దివ్యాంగుల సంక్షేమానికి గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అత్యాధునిక ఉపకరణాల పంపిణీ మొదలు.. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వరకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తోంది. వారి మోముల్లో ఆనందం వెల్లివిరిసేలా చేస్తోంది.

దివ్యాంగుల్లో.. వెలుగురేఖ

- అడుగడుగునా.. అండా..దండా
- జిల్లాలో రూ.96 లక్షలతో 80 మందికి మూడుచక్రాల మోటారు వాహనాలు
- రూ.1.60 కోట్ల విలువైన ఉపకరణాల అందజేత
- చదువుకునే దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు, టచ్‌ఫోన్లు పంపిణీ
- బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ
- గతేడాది 34 పోస్టులు భర్తీ
- ఈ ఏడాది 23 పోస్టుల భర్తీకి చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

ఒంగోలు అర్బన్: శారీరక వైకల్యం అనేది మెరుగైన జీవనానికి అడ్డంకి కాదని, వారికి మరింత తోడ్పాటునందిస్తే ఏదైనా సాధించగలరనే గొప్ప ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు చేయూతనిస్తోంది. వారి సంక్షేమానికి, జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక పథకాలు అమలు చేస్తోంది. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల పంపిణీతో పాటు అర్హత ఉన్న వారికి బ్యాక్‌లాగ్ ఉద్యోగాలిస్తూ వారి జీవితాలకు భరోసా ఇస్తోంది. గత ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల కష్టాలు, కన్నీళ్లను దగ్గరగా చూసి అధికారంలోకి వచ్చి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నవరత్నాల అమలుతో అందరికీ మేలు చేస్తూ వచ్చారు. అందులో భాగంగా దివ్యాంగులకు సైతం నేనున్నానంటూ భరోసా ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారు. దివ్యాంగుల్లో సంతోషాన్ని చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కలెక్టర్ దినేష్‌కుమార్ దివ్యాంగులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు, తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. సంబంధిత అధికారులతో నిరంతరం సమీక్షిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేలా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాల మొదలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా వారికి ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు వంటివి కూడా అందజేస్తూ మరింతగా ప్రోత్సహిస్తున్నారు.

నిరంతరం పది రకాల ఉపకరణాలు పంపిణీ...

మూడు చక్రాల మోటారు వాహనాలు, బ్యాటరీ ట్రైసైకిల్, ట్రై సైకిల్, వీల్‌చైర్, ల్యాప్ టాప్, టచ్ ఫోన్, వినికిడి పరికరాలు, బ్లయిండ్ స్టిక్స్, వృద్ధుల చేతి కర్రలు, క్రట్చస్ వంటి పది రకాల ఉపకరణాలను దివ్యాంగుల అవసరాలను బట్టి నిరంతరం పంపిణీ చేస్తున్నారు. దివ్యాంగ విద్యార్థుల చదువులకు ఉపయోగపడేలా ల్యాప్‌టాప్‌లు, బధిరులకు ఉపయోగపడేలా మొబైల్ ఫోన్లతో పాటు తదితరాలను దశల వారీగా పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇప్పటి వరకు రూ.1,62,29,800 వ్యయంతో ఉపకరణాలు అందజేశారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ...

దివ్యాంగులకు సంబంధించి ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేందుకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జిల్లాలో గతేడాది 34 పోస్టులు భర్తీ చేయగా, ఈ ఏడాది 23 పోస్టులు భర్తీ చేసే ప్రక్రియ జరుగుతోంది.

మూడు చక్రాల మోటారు వాహనాల పంపిణీ...

జిల్లాలో నియోజకవర్గానికి 10 చొప్పున 80 మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలు అందిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో పంపిణీని ప్రారంభించారు. అయితే, మూడు చక్రాల వాహనాల స్పేర్ పార్ట్‌లు కంపెనీ నుంచి రావడం కొంత ఆలస్యం కావడంతో పంపిణీలో కొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం స్పేర్స్ అందడంతో మోటారు వాహనాలకు అదనపు చక్రాలను వేగంగా బిగిస్తున్నారు. త్వరలో లబ్ధిదారులకు మోటారు వాహనాలు పంపిణీ చేయనున్నారు. ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణం కింద జిల్లాలో 22 మంది దివ్యాంగులకు 2022-23 సంవత్సరంలో రూ.60,50,000 రుణం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సహాయ సహకారాలే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, ఇతర దాతల సహకారంతో దివ్యాంగులకు మరింతగా ఉపయోగపడే కార్యక్రమాలు అమలుచేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



దివ్యాంగులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న మూడు చక్రాల మోటారు వాహనాలు

దివ్యాంగుల ఆత్మస్థైర్యం స్ఫూర్తిదాయకం



దివ్యాంగుల ఆత్మస్థైర్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఎంతో మంది దివ్యాంగులు ఉన్నతస్థాయికి ఎదిగి ఉన్నారు. జిల్లాలో దివ్యాంగులకు వీలైనంత సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. వారికి అందాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందిస్తూ అండగా నిలుస్తున్నాం. దివ్యాంగుల సంక్షేమ శాఖతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నాం. దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు సాగాలి.

– దినేష్‌కుమార్, కలెక్టర్

దివ్యాంగులకు పారదర్శకమైన సేవలు



దివ్యాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహిస్తూ సేవలందిస్తున్నాం. కలెక్టర్ సూచనలు, ఆదేశాల మేరకు దివ్యాంగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల జీవనం మెరుగుపడేలా వారికి చేయూతనందిస్తోంది. మరో వారంలో మూడు చక్రాల మోటారు వాహనాలు పంపిణీ చేస్తాం.

– అర్చన, ఏడీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ

ఉద్యోగంతో కుటుంబంలో సంతోషం



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీలో టైపిస్ట్‌గా ఉద్యోగం రావడంతో నా కుటుంబం మొత్తం సంతోషంగా ఉంది. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న భరోసా ఎంతగానో మేలు చేస్తోంది. ఉద్యోగం రావడం వలన ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు నా కుటుంబానికి అండగా నిలవగలుగుతున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– పి.చక్రపాణి, విజువల్లీ చాలెంజ్డ్ పర్సన్

దివ్యాంగుల చదువులకు ప్రభుత్వ సాయం మరువలేం



దివ్యాంగుల చదువులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ల్యాప్‌టాప్ అందజేయడం సంతోషకరం. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలతో పాటు చదువుల్లో ప్రోత్సహించడం, ఉద్యోగాలు కల్పించడం వంటివి అభినందనీయం.

– సీహెచ్ సత్యనారాయణ, ల్యాప్‌టాప్ లబ్ధిదారుడు

టచ్ ఫోన్లతో సులభంగా కమ్యూనికేషన్

రాష్ట్ర ప్రభుత్వం వినికిడి సమస్య ఉన్న బధిరులు కమ్యూనికేషన్ చేసుకునేందుకు వీలుగా టచ్‌ఫోన్‌లు ఇవ్వడం సంతోషకరం. ఈ ఫోన్ ద్వారా కమ్యూనికేషన్ సులభతరమైంది. దివ్యాంగులకు ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు అభినందనీయం.

– తమ్మిశెట్టి వెంకట నరేంద్ర, వి.అశోక్‌రెడ్డి (బధిరులు)



కార్మికుల కుటుంబాలకు భరోసా

- మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- చెక్కులు అందజేసిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. చీమకుర్తి మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతి చెందిన ఐదుగురు కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో స్థానికంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. చీమకుర్తి మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులలో కడియం ఆదెయ్య, చట్టి లింగయ్య, ఓడిపోగు ప్రేమయ్య, బిరుదుల పాల్, అల్లడి హనుమంతురావు గతంలో మృతి చెందారు. జీవో ఎంఎస్ నంబర్ 25 ప్రకారం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ మరణించిన వారికి రూ.5 లక్షలు, సహజ మరణం పొందిన వారికి రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. చీమకుర్తి మున్సిపాలిటీలో ఐదుగురు కార్మికులు సహజ మరణం పొందడంతో ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున వారి కుటుంబ సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమచేయించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బాపతు వెంకటరెడ్డి, నలమల మాణిక్యం, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ఐవీఎఫ్‌తో మేలు జాతి ఆవులు

- జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి

కొత్తపట్నం: ఒంగోలు జాతి ఆవుల గర్భంలోకి ఐవీఎఫ్ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన అధిక పాల సార కలిగిన మేలు రకం గిర్ జాతి పిండాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా మేలు జాతి ఆవులు ఉత్పత్తి అవుతాయని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ కె.బేబీరాణి తెలిపారు. తద్వారా అధిక పాలు ఉత్పత్తయి రైతుకు లాభం చేకూరుతుందన్నారు. ఒంగోలు జాతి ఆవు గర్భంలోకి ఐవీఎఫ్ పరిజ్ఞానంతో గిర్ జాతి పిండాన్ని ప్రవేశపెట్టే కార్యక్రమాన్ని కొత్తపట్నం మండలంలోని సిరివనం పశువుల క్షేత్రంలో గురువారం ప్రారంభించారు. క్షేత్రంలోని ప్రతి ఆవుకు గిర్ జాతి పిండాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ జన్యుపరమైన మేలు జాతి పశువులను తక్కువ సమయంలో వృద్ధి చేసేందుకు ఐవీఎఫ్ పిండ మార్పిడి విధానం అనుకూలమైన పద్ధతి అని వివరించారు. తక్కువ పాల దిగుబడి ఉన్న ఆవుల గర్భంలోకి మేలు రకం పిండాన్ని ప్రవేశపెట్టడం ద్వారా తక్కువ సమయంలోనే మేలు జాతి దూడలు పొందవచ్చన్నారు. ఆ దూడలో వ్యాధి నిరోధక శక్తి కూడా అధికంగా ఉంటుందన్నారు. ప్రతి రైతు అవగాహన పెంచుకుని ఐవీఎఫ్ పరిజ్ఞానంతో పిండ మార్పిడి చేయించుకోవాలని జేడీ సూచించారు. పూర్తి వివరాలకు దగ్గరలోని పశువుల డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ సోమశేఖర్‌లు మేలు రకం గిర్ జాతి పిండాన్ని శాస్త్రీయంగా ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో కొత్తపట్నం పశువైద్యాధికారి డాక్టర్ యు.ఆషా, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఐవీఎఫ్ పరిజ్ఞానంతో పిండాన్ని ప్రవేశపెట్టడంపై అవగాహన కల్పిస్తున్న జేడీ డాక్టర్ బేబీరాణి

వేమూరి బుజ్జికి మేయర్ బాధ్యతలు

- అమెరికా వెళ్లిన మేయర్ గంగాడ సుజాత
- ఈ నెల 23 వరకు ఆ బాధ్యతలు నిర్వహించనున్న వేమూరి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్-1గా ఉన్న వేమూరి సూర్యనారాయణ (బుజ్జి) కొద్దిరోజులు మేయర్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆ మేరకు ఒంగోలు మేయర్ గంగాడ సుజాత నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. మేయర్ ప్రొసీడింగ్స్ కాపీని డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణకు గురువారం కమిషనర్ అందించారు. మేయర్ గంగాడ సుజాత తన కుమారుడి గ్రాడ్యుయేషన్ కాన్వొకేషన్ సెరెమనీకి హాజరయ్యేందుకు ఈ నెల 7వ తేదీ అమెరికా బయలుదేరి వెళ్లారు. దీంతో ఈ నెల 8 నుంచి 23వ తేదీ వరకు ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ హోదాలో డిప్యూటీ మేయర్-1 వేమూరి సూర్యనారాయణ బాధ్యతలు నిర్వహిస్తారు. మేయర్ చేయాల్సిన విధులన్నింటినీ సూర్యనారాయణ చేపడతారు. తప్పనిసరి రెసొల్యూషన్స్ లాంటి వాటిని కూడా ఆయనే ఆమోదిస్తారని కూడా ఆ ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్నారు. ఆ మేరకు కమిషనర్‌తో పాటు డిప్యూటీ మేయర్-2 వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులకు కూడా సమాచారాన్ని అందించారు. ప్రొసీడింగ్స్ కాపీ అందించే కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



వేమూరి సూర్యనారాయణకు ప్రొసీడింగ్స్ కాపీ అందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, పాల్గొన్న కార్పొరేటర్లు

వేద స్వరూపుడికి నాదనీరాజనం



పూజలందుకుంటున్న శ్రీవారి ఉత్సవమూర్తులు

ఒంగోలు టౌన్: నగరంలోని కుర్తాళం సిద్ధేశ్వర పీఠ పాలిత శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని వేదస్వరూపుడైన శ్రీవారికి గురువారం నాదనీరాజనం సమర్పించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా శ్రీవారికి విశేష పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. చతుర్వేద పారాయణం స్తుతించారు. ఆయా కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వేంకటరమణారావు, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాల రామారావు, కార్య నిర్వాహక ధర్మకర్త సీవీ రామకృష్ణారావు పర్యవేక్షించారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు వెంకటేశ్వరస్వామికి సువర్ణ అష్టదళ పద్మ పాదార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సబ్‌ప్లాన్‌ను చిత్తశుద్ధితో అమలు చేయాలి

- దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్

ఒంగోలు: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను చిత్తశుద్ధితో అమలు చేయాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్ కోరారు. గురువారం స్థానిక ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా వర్గాలకు ఆర్థిక స్వావలంబన ప్రణాళికలు సిద్ధం చేసేలా చట్టాన్ని బలోపేతం చేయాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య మాట్లాడుతూ పేదరిక నిర్మూలన పథకాలు ఊరి చివర ఉన్న షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, ఇతర కులాల మధ్య ఉన్న సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించలేకపోతున్నాయన్నారు. ఆశించిన స్థాయిలో మార్పులు తీసుకురాలేకపోయాయన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కరవది సుబ్బారావు మాట్లాడుతూ పంచవర్ష ప్రణాళికలో సబ్‌ప్లాన్ అంతర్భాగమేనని, ఆ నిధులను వేరే పనులకు మళ్లించకూడదని అన్నారు. పూర్తిగా వ్యయం చేయాలన్నారు. కార్యక్రమంలో కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి రఘురాం, జైభీమ్ పాంథర్స్ జిల్లా అధ్యక్షుడు పాలడుగు రమేష్, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి బిల్లా శరత్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు బాలసుందరం తదితరులు ప్రసంగించగా, దార్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పాలెపోగు డగ్లస్, తాళ్లూరు కోటేశ్వరరావు, శాంతరాజ్, డీపీఆర్ ప్రసాద్, చప్పిడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవకుమార్

ఐటీఐ ప్రవేశాలకు జూన్ 6 గడువు తేదీ

ఒంగోలు: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మొదటి విడత ప్రవేశాలకు జూన్ 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకాశం జిల్లా బాలుర ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎంవీ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అనంతరం నమోదుకు సంబంధించిన పత్రాలను ప్రింట్ తీసుకోవాలన్నారు. జిల్లాలో ఒకటి కంటే ఎక్కువ ఐటీఐ కాలేజీలను కూడా ఎంపిక చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసిన వారు దరఖాస్తు ప్రింట్ కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని సమీప ప్రభుత్వ ఐటీఐలో జూన్ 7వ తేదీ వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. ఈ ఏడాది నుంచి ఒంగోలు బాలికల ఐటీఐలో డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ అనే ఆరు నెలల కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9701271497ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

టెన్త్ ఫలితాల్లో కనిగిరి బీసీ హాస్టల్ విద్యార్థిని ప్రతిభ

మార్కాపురం: ఇటీవల ప్రకటించిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో బీసీ హాస్టల్స్ విభాగంలో కనిగిరి బీసీ బాలికల వసతి గృహం విద్యార్థిని కె.ప్రియదర్శిని 585 మార్కులతో స్టేట్ ఫస్ట్‌గా నిలిచిందని మార్కాపురం డివిజన్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జబ్బార్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మార్కాపురం డివిజన్‌లోని 18 బీసీ హాస్టళ్లలో మొత్తం 259 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 189 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇందులో 138 మంది ఫస్ట్ డివిజన్‌లో, 36 మంది సెకండ్ డివిజన్, 15 మంది థర్డ్ డివిజన్‌లో పాసయ్యారని వివరించారు.

చెస్ చాంపియన్‌షిప్‌కు సోపిరాల కుర్రోడు ఎంపిక


రజత పతకంతో అజయ్ సంతోష్

చినగంజాం: అంతర్జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు సోపిరాల కుర్రాడు పర్వతరెడ్డి అజయ్ సంతోష్ ఎంపికయ్యాడు. రిటైర్డ్ ఆంధ్రా బ్యాంక్ మేనేజర్ పర్వతరెడ్డి కాంతారావు మనవడు అజయ్ సంతోష్ తన తండ్రి మయూర్ ఉద్యోగ రీత్యా నోయిడాలో పని చేస్తుండటంతో అక్కడే విద్యాభ్యాసం చేస్తున్నాడు. జాతీయ స్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ కనబరుస్తున్నాడు. ఇటీవల పంజాబ్‌లోని జలంధర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి చెస్ టోర్నమెంట్‌లో అండర్-17 విభాగంలో పాల్గొని రజతం పతకం సాధించాడు. యూరప్‌లో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకు అజయ్ సంతోష్ ఎంపికయ్యాడని కాంతారావు తెలిపారు.

బెల్ట్ షాపు నిందితుడికి జైలుశిక్ష

దర్శి: అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఎస్‌ఈబీ పోలీసులకు పట్టుబడిన నిందితుడికి గురువారం దర్శి జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ 6 నెలల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధించినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.సుందరరామయ్య తెలిపారు. దర్శి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గుర్రపుశాల పెద నరసింహారావు మద్యం విక్రయిస్తూ పట్టుబడటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, ఈ మేరకు కోర్టు శిక్ష విధించిందని చెప్పారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మొత్తం 33 బృందాలుగా విడిపోయి 2,434 మీటర్లను తనిఖీ చేశారు. రూ.8.76 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. అదనపు లోడు, మాల్‌ప్రాక్టీస్, విద్యుత్ చౌర్యం వంటి పలు రకాల కేసులు నమోదు చేశారు. విద్యుత్ శాఖ ఈఈ పీ శ్రీనివాసులు, డీఈ తోట శ్రీనివాసరావుతో పాటు పలువురు ఇంజినీర్లు, విద్యుత్ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

బూచేపల్లి సుబ్బారెడ్డి సేవలు అమూల్యం


బూచేపల్లి సుబ్బారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, కుటుంబ సభ్యులు


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే టీజేఆర్

- నివాళులర్పించిన జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి
- వర్ధంతి సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ, అన్నదానం

చీమకుర్తి: మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి పేదలకు అందించిన సేవలు అమూల్యమైనవని ఆయన సతీమణి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, కుమారుడు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి కొనియాడారు. సుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల విషయంలో బూచేపల్లి సుబ్బారెడ్డి మానవతా దృక్పథంతో వ్యవహరించారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. తొలుత బూచేపల్లి సుబ్బారెడ్డి ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, నలమల మాణిక్యం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోగినేని వెంకటేశ్వర్లు, పట్టణంలోని 20 వార్డులకు చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేణుగోపాలుడి రథోత్సవం

యర్రగొండపాలెం: రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం గురువారం కనుల పండువగా సాగింది. మిల్లంపల్లిలోని స్వామివారి ఆలయం నుంచి యర్రగొండపాలెంలోని ప్రధాన వీధుల్లో సాగిన రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ యక్కలి భాగ్యారావు, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐవీ సుబ్బారావు, పెద్దకాపు జి.వెంకటరెడ్డి పర్యవేక్షించారు.




రథంపై ఆశీనులైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి(ఇన్‌సెట్‌లో) రథాన్ని లాగుతున్న మహిళలు

మర్రిపూడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

మర్రిపూడి: వార్షిక తనిఖీలో భాగంగా మర్రిపూడి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మలికా గర్గ్ గురువారం పరిశీలించారు. తొలుత స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి, సిబ్బంది పని తీరు, వసతులపై ఆరా తీశారు. మండలంలోని 21 పంచాయతీల్లో మహిళా పోలీసులు ఎంత మంది ఉన్నారు, ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి, స్టేషన్‌లో సిబ్బంది కొరత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ట్రైనీ ఐపీఎస్ అంకితా సురానా, కనిగిరి డీఎస్పీ రామరాజు, సీఐ వై.పాండురంగారావు, పొన్నలూరు, కొండపి, మర్రిపూడి ఎస్సైలు రాజారావు, వైవీ రమణయ్య, పి.అంకమ్మరావు, ఏఎస్సై రవికుమార్, రైటర్ సీతారామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ మలికాగర్గ్

వివాహిత యువతి అనుమానాస్పద మృతి


యువతి మృతిపై స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్సై

తర్లుపాడు: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన వివాహిత యువతి ముక్కర గ్రేస్ మేరీ(19) గురువారం అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. వివరాలు.. మేరీకి తీవ్ర కడుపునొప్పి రావడవంతో ఆమె భర్త మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది. ఈ సంఘటనపై మృతురాలి తల్లి మాట్లాడుతూ.. అల్లుడు దాడి చేయడం వల్లే తన కుమార్తె చనిపోయిందని ఆరోపించారు. వివాహమై నాలుగు నెలలే అయిందని, వారి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయని, తన కుమార్తె 4 నెలల గర్భిణి అని చెప్పారు. ఒంగోలు జీజీహెచ్‌లో మృతదేహానికి తహసీల్దార్ వరకుమార్ పంచనామా చేశారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

ఆకట్టుకుంటున్న నాటికలు

చీరాల అర్బన్: కళాంజలి, చీరాల సాంస్కృతిక మిత్రమండలి ఆధ్వర్యంలో చీరాలలోని కేజీఎం గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి జాతీయ నాటకోత్సవాల్లో ప్రదర్శిస్తున్న నాటికలు ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. గురువారం నాటిక పోటీలకు పోలవరపు జగదీశ్వరరావు కళాప్రాంగణంగా నామకరణం చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు హాజరయ్యారు. నాటిక పోటీల్లో భాగంగా రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి ప్రదర్శించిన ×చాణిక్య శపథం ఏకపాత్రాభినయం సభికులను ఆకట్టుకుంది. అలాగే కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ బృందం ప్రేమతో.. నాన్న నాటికను ప్రదర్శించింది. ఈ నాటికకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. అనంతరం విశాఖపట్నం తెలుగు కళాసమితి బృందం చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వంలో నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికను ప్రదర్శించారు. ఉత్సవాలను తిలకించేందుకు ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమలశెట్టి సాంబశివరావు, వలివేటి మురళీకృష్ణ, బీరం సుందరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి దరియా సాహెబ్, పూర్ణా సత్యం, వడలి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ప్రేమతో నాన్న నాటికలో ఓ సన్నివేశం

గడ్డి మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

ముండ్లమూరు: మండలంలోని వేములబండ గ్రామంలో నలబోతుల చిన కోటేశ్వరరావు(63) బుధవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. చిన కోటేశ్వరరావు, సుబ్బులు దంపతులకు ఇద్దరు కుమార్తెలు సుధారాణి, కృష్ణవేణి ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో సుమారు ఎనిమిదేళ్లుగా భీమవరంలోని పుట్టింట్లో ఉంటోంది. పెద్ద కుమార్తె సుధారాణి తండ్రి వద్ద, చిన్న కుమార్తె కృష్ణవేణి తల్లి దగ్గర ఉంటున్నారు. సుగర్, బీపీ, మానసిక రుగ్మతలతో బాధపడుతున్న కోటేశ్వరరావు ఒత్తిడికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీఆర్వో కోటయ్య సమాచారం మేరకు ఏఎస్సై పవన్‌కుమార్ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి పెద్ద కుమార్తె సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.


చినకోటేశ్వరరావు మృతదేహం

కూలీల ఆటోను ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

చినగంజాం: ఎదురుగా వస్తున్న ఆటోను కారు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో కడవకుదురు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.సురేష్ కథనం మేరకు.. కడవకుదురు గ్రామానికి చెందిన పలువురు భవన నిర్మాణ కార్మికులు రోజూ పనుల నిమిత్తం ఇంకొల్లు వెళ్లి వస్తుంటారు. గురువారం పని ముగించుకుని ఆటోలో ఇంటికి బయలుదేరారు. కడవకుదురు సమీపంలో రొంపేరు వంతెన దాటుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పూలవారిపాలెం గ్రామానికి చెందిన సోమిశెట్టి శ్రీనివాసరావు(51), కడవకుదురు గ్రామానికి చెందిన గద్దం సుబ్బారావు, గద్దం నాగేశ్వరరావులకు కాళ్లు విరిగాయి. గద్దం నాగలక్ష్మి, లక్ష్మి, ఆటో డ్రైవర్ గాజుల అంజయ్య, పోలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఒంగోలు నుంచి చింతగుంపల గ్రామంలో వివాహ వేడుకకు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న ఇరువురు పురుషులు, మహిళలు సురక్షితం కాగా, కారు డ్రైవర్ మాత్రం ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సోమిశెట్టి శ్రీనివాసరావును 108 వాహనంలో చీరాల వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు కాగా వారిరువురికీ వివాహాలయ్యాయి. కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై సురేష్


సోమిశెట్టి శ్రీనివాసరావు(ఫైల్)


ప్రమాదంలో మృతి చెందిన సోమిశెట్టి శ్రీనివాసరావు

విద్యార్థి బలవన్మరణం.. తల్లిదండ్రులకు పుట్టెడు శోకం

జరుగుమల్లి(సింగరాయకొండ): పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణుడిని కాలేదన్న మానసిక వేదనతో ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడి తల్లిదండ్రులకు పుట్టెడు శోకాన్ని మిగిల్చాడు. ఈ విషాదకర సంఘటన జరుగుమల్లి మండలం కామేపల్లి ఆదిఆంధ్ర కాలనీలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కామేపల్లి ఆదిఆంధ్ర కాలనీకి చెందిన బుడంగుంట్ల సుజిత్(17) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివాడు. ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. దీంతో మనోవేదనకు గురైన సుజిత్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పని నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన బాలుడి తండ్రి యోహాన్.. కుమారుడిని చూసి హతాశుడయ్యాడు. ఫ్యానుకు వేలాడుతున్న సుజిత్‌ను కిందకు దించి ప్రథమ చికిత్స కోసం ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లాడు.

సుజిత్ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని చెప్పడంతో వెంటనే ప్రైవేట్ వాహనంలో కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మరణించాడని ధృవీకరించారు. యోహాన్‌కు ముగ్గురు పిల్లలు కాగా సుజిత్ చివరివాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి వెంకటేశ్వరరావు తెలిపారు. మృతదేహానికి కందుకూరు ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షలో ఫెయిలైనంతమాత్రాన క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడవద్దని విద్యార్థులకు ఎస్సై సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ధైర్యం చెప్పాలే తప్ప వారిని తూలనాడవద్దని హితవుపలికారు.


విద్యార్థి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు



ఫైనల్లో బెర్త్ కోసం బరిలో భారత బాక్సర్లు

ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ముగ్గురు భారత బాక్సర్లు కీలకపోరుకు సిద్ధమయ్యారు. తెలంగాణకు చెందిన హుసాముద్దీన్ (57 కేజీలు), హరియాణాకు చెందిన దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) సెమీఫైనల్ బౌట్‌లలో పోటీపడనున్నారు. 2022 యూరోపియన్ చాంపియన్ బిలాలా బెనామా (ఫ్రాన్స్)తో దీపక్; సైడెల్ హోర్టా (క్యూబా)తో హుసాముద్దీన్; 2022 ఆసియా చాంపియన్ అస్లాన్‌బెక్ షింబెర్జనోవ్ (కజకిస్తాన్)తో నిశాంత్ దేవ్ తలపడతారు. సెమీఫైనల్లో గెలిస్తే ఫైనల్ చేరి స్వర్ణ-రజత పతకాల బరిలో ఉంటారు. ఓడితే కాంస్య పతకాన్ని గెల్చుకుంటారు. భారత కాలమానం ప్రకారం నేడు సాయంత్రం గం. 5:30కు దీపక్ బౌట్ ఉంది. ఆ తర్వాత హుసాముద్దీన్, నిశాంత్ దేవ్ బౌట్‌లు జరుగుతాయి. ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ఈ బౌట్‌లను ప్రత్యక్షంగా తిలకించవచ్చు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటి వరకు భారత్ నుంచి ఒక్కరే ఫైనల్‌కు అర్హత సాధించారు. 2019లో అమిత్ పంఘాల్ (52 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకం గెల్చుకున్నాడు.

సరబ్‌జోత్–దివ్య జోడీకి స్వర్ణం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్–దివ్య థడిగోల్ సుబ్బరాజు (భారత్) ద్వయం విజేతగా నిలిచింది. స్వర్ణ–రజత పతక ఫైనల్ పోరులో సరబ్‌జోత్–దివ్య జోడీ 16–14తో జొరానా అరునోవిచ్–దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయంపై విజయం సాధించింది. సరబ్‌జోత్ కెరీర్‌లో ఇది రెండో ప్రపంచకప్ స్వర్ణంకాగా... బెంగళూరుకు చెందిన దివ్యకు ప్రపంచకప్ టోర్నీలలో తొలి పతకం కావడం విశేషం. మొత్తం 55 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్–దివ్య ద్వయం 581 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. భారత్‌కే చెందిన ఇషా సింగ్–వరుణ్ తోమర్ జంట 578 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచి పతక మ్యాచ్‌లకు అర్హత పొందడంలో విఫలమైంది. టాప్–4లో నిలిచిన జోడీలు పతక మ్యాచ్‌లకు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో రెండు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

‘బ్లాక్‌డే’ పాటించిన రెజ్లర్లు



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్ల నిరసన జంతర్ మంతర్ వద్ద కొనసాగుతోంది. నిరసనకు 18వ రోజైన గురువారం రెజ్లర్లు ‘బ్లాక్‌డే’గా పాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీరంతా నల్ల బ్యాండ్‌లు ధరించి తమ అసంతృప్తిని ప్రదర్శించారు. ‘ఈ రోజు మేం బ్లాక్‌డే పాటించాం. దేశం మొత్తం మాకు అండగా నిలుస్తోంది కాబట్టి విజయం సాధిస్తామని నమ్ముతున్నాం. న్యాయం దక్కే వరకు మా నిరసన కొనసాగుతుంది’ అని బజరంగ్, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ అన్నారు.

శ్రీకాంత్‌కు విదేశీ కోచ్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్నాడు. ఇండోనేసియాకు చెందిన వీంపి నహార్ది ఇక నుంచి శ్రీకాంత్‌కు శిక్షణ ఇస్తాడు. 2021 డిసెంబర్‌లో భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్‌గా ఉన్న అగుస్ ద్వి సాంతోసో తిరిగి వెళ్లిపోయాక భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్ లేకుండా పోయాడు. కోచ్ కావాలని భారత స్పోర్ట్స్ అథారిటీకి గత జనవరిలో ప్రతిపాదన పంపించినా ఎలాంటి చర్యలు లేకపోవడం... ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలు మొదలుకావడంతో తానే కోచ్‌ను నియమించుకున్నానని శ్రీకాంత్ తెలిపాడు.

భారత్‌కు క్లిష్టమైన ‘డ్రా’



దోహా: ఏషియన్ కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు కఠినమైన ‘డ్రా’ ఎదురైంది. వచ్చే ఏడాది జనవరిలో ఖతర్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్ ‘బి’లో ఆస్ట్రేలియా (ప్రపంచ 29వ ర్యాంక్), ఉజ్బెకిస్తాన్ (74వ ర్యాంక్), సిరియా (90వ ర్యాంక్) జట్లతో కలిసి భారత్ (101వ ర్యాంక్) ఉంది. వచ్చే ఏడాది జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. 67 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో భారత జట్టు 1964లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత భారత్ 1984లో, 2011లో, 2019లో ఈ టోర్నీకి అర్హత సాధించినా గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

జై జైస్వాల్...

47 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98 నాటౌట్
- 9 వికెట్లతో రాజస్తాన్ ఘన విజయం
- ఈడెన్‌లో కోల్‌కతా చిత్తు
- చహల్‌కు 4 వికెట్లు


చహల్




యశస్వి జైస్వాల్

తొలి ఓవర్లో 6, 6, 4, 4, 2, 4... ఇలా దూకుడు మొదలు పెట్టిన యశస్వి జైస్వాల్ ఆగలేదు... తొలి 6 బంతుల్లో 26 పరుగులు రాబట్టిన అతను తర్వాతి 7 బంతుల్లో మరో 24 పరుగులు కొట్టేశాడు. అంతే...13 బంతుల్లో ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో కొత్త రికార్డు సృష్టించాడు. 3 ఓవర్లలోపే యశస్వి హాఫ్ సెంచరీ అయిపోయింది. మరో 3 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 78 పరుగులు. అక్కడే మ్యాచ్‌లో ఎవరు గెలవబోతున్నారో అర్థమైపోయింది! ఇక మిగిలింది యశస్వి ఎంత దూరం, ఎలా వెళతాడనేది... సెంచరీ వరకు చేరగలిగాడు కానీ రెండు పరుగుల తేడాతో శతకం చేజారింది. అయితేనేం ఐపీఎల్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడిన జైస్వాల్ రాజస్తాన్ జట్టును గెలిపించాడు... మరో ఎండ్‌లో కెప్టెన్ సామ్సన్ మెరుపు బ్యాటింగ్‌తో పని సులువైంది. రాజస్తాన్ 41 బంతులు మిగిలి ఉండగానే నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	0.951
చెన్నై	12	7	4	1	15	0.493
రాజస్తాన్	12	6	6	0	12	0.633
ముంబై	11	6	5	0	12	-0.255
లక్నో	11	5	5	1	11	0.294
బెంగళూరు	11	5	6	0	10	-0.345
కోల్‌కతా	12	5	7	0	10	-0.357
పంజాబ్	11	5	6	0	10	-0.441
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	11	4	7	0	8	-0.605

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు
ముంబై × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్తాన్ పండగ చేసుకుంది. నైట్‌రైడర్స్ బ్యాటింగ్ చేసినంత సేపూ నెమ్మదిగా అనిపించిన పిచ్‌పైనే పరుగులు వరద పారించి కీలక విజయాన్ని అందుకుంది. గురువారం జరిగిన పోరులో రాజస్తాన్ 9 వికెట్ల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (42 బంతుల్లో 57; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. యజువేంద్ర చహల్ 25 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి కోల్‌కతాను కట్టడి చేశాడు. అనంతరం రాజస్తాన్ 13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 151 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 98 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (29 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగి జట్టును లక్ష్యానికి చేర్చారు.

వెంకటేశ్ అయ్యర్ బ్యాటింగ్‌ను మినహాయిస్తే కోల్‌కతా ఇన్నింగ్స్ ఆసాంతం పేలవంగా సాగింది. వెంకటేశ్ కూడా మరీ విధ్వంసకరంగా ఆడకపోయినా... పరిస్థితిని బట్టి తనవంతు పాత్ర పోషించాడు. వెంకటేశ్ 42 బంతుల్లో 57 పరుగులు చేయగా ... ఇతర ఆటగాళ్లంతా కలిసి 78 బంతుల్లో 89 పరుగులు చేయగలిగారంటే అతని ఇన్నింగ్స్ విలువ తెలుస్తుంది.

ధనాధన్...

ఆశ్చర్యకరంగా పార్ట్‌టైమ్ బౌలర్, కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా మొదటి ఓవర్ వేశాడు. ఆ ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టి ప్రత్యర్థిని యశస్వి కఠినంగా శిక్షించాడు. సమన్వయ లోపంతో జోస్ బట్లర్ (0) రనౌట్ కావడంతో రాయల్స్ తొలి వికెట్ కోల్పోయింది. అయితే జట్టుపై అది ఎలాంటి ప్రభావం చూపించలేదు. యశస్వి, సామ్సన్ కలిసి వేగం తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరి షాట్లకు నైట్‌రైడర్స్ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. సామ్సన్ 16 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను నేలపాలైంది. అనంతరం అనుకూల్ వేసిన ఓవర్లో 3 సిక్సర్లతో సామ్సన్ చెలరేగాడు. చివర్లో యశస్వి సెంచరీ విషయంలో కాస్త ఉత్కంఠ నెలకొంది. యశస్వి 94 పరుగుల వద్ద ఉండగా రాయల్స్‌కు 3 పరుగులు కావాలి. 13వ ఓవర్ చివరి బంతికి పరుగు తీయని సామ్సన్ సిక్సర్ కొట్టమన్నట్లుగా సైగ చేస్తూ యశస్వికి అవకాశం ఇచ్చాడు. అయితే తర్వాతి బంతికి ఫోర్ మాత్రమే రావడంతో యశస్వి 98 పరుగుల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది. అయితే దానిని పట్టించుకోకుండా అతను విజయానందాన్ని ప్రదర్శించాడు.

1 ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసిన క్రికెటర్‌గా యశస్వి (13 బంతుల్లో) నిలిచాడు. గతంలో ఈ రికార్డు కేఎల్ రాహుల్, కమిన్స్ (14 బంతుల్లో) పేరిట ఉంది.

187 ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చహల్ రికార్డు నెలకొల్పాడు. డ్వేన్ బ్రేవో (161 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును చహల్ (143 బంతుల్లో 187 వికెట్లు) సవరించాడు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) హెట్‌మైర్ (బి) బౌల్ట్ 10; గుర్బాజ్ (సి) సందీప్ శర్మ (బి) బౌల్ట్ 18; వెంకటేశ్ (సి) బౌల్ట్ (బి) చహల్ 57; నితీశ్ రాణా (సి) హెట్‌మైర్ (బి) చహల్ 22; రసెల్ (సి) అశ్విన్ (బి) ఆసిఫ్ 10; రింకూ సింగ్ (సి) రూట్ (బి) చహల్ 16; శార్దుల్ (ఎల్బీ) (బి) చహల్ 1; అనుకూల్ (నాటౌట్) 6; నరైన్ (సి) రూట్ (బి) సందీప్ 6; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 149.** వికెట్ల పతనం: 1–14, 2–29, 3–77, 4–107, 5–127, 6–129, 7–140, 8–149. **బౌలింగ్:** బౌల్ట్ 3–0–15–2, సందీప్ శర్మ 4–0–34–1, అశ్విన్ 4–0–32–0, రూట్ 2–0–14–0, యజువేంద్ర చహల్ 4–0–25–4, ఆసిఫ్ 3–0–27–1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (నాటౌట్) 98; బట్లర్ (రనౌట్) 0; సామ్సన్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 151.** **వికెట్ల పతనం:** 1–30. **బౌలింగ్:** నితీశ్ రాణా 1–0–26–0, హర్షిత్ రాణా 2–0–22–0, శార్దుల్ ఠాకూర్ 1.1–0–18–0, వరుణ్ చక్రవర్తి 3–0–28–0, సునీల్ నరైన్ 2–0–13–0, సుయశ్ 3–0–22–0, అనుకూల్ 1–0–20–0.

సినిమా



ఆ విషయం ఓ సవాల్‌గా మారింది
- నాగచైతన్య

“ఓ నటుడుగా నన్ను నేనెప్పుడూ విమర్శించుకుంటూనే ఉంటాను... అభినందించుకోను. ఎప్పటికప్పుడు తప్పులు వెతుకుతూనే ఉంటాను.. నటుడిగా నన్ను నేను మెరుగుపరచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాను” అని అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం ‘కస్టడీ’. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగచైతన్య చెప్పిన విశేషాలు.

- తమిళ చిత్రం ‘మానాడు’ విడుదల కాకముందే వెంకట్ ప్రభుగారు నాకు ‘కస్టడీ’ స్టోరీ చెప్పారు. అయితే ‘మానాడు’ విడుదలై, హిట్ సాధించిన తర్వాత, ఈ సినిమానే మేం తెలుగులో రీమేక్ చేస్తే బాగుంటుందన్నట్లుగా కొందరు నిర్మాతలు అభిప్రాయపడ్డారు. కానీ ‘కస్టడీ’ స్టోరీ నన్ను ఎగ్జయిట్ చేసింది. పైగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొంతవరకు పూర్తయింది. దీంతో ‘కస్టడీ’ని సెట్స్‌పైకి తీసుకెళ్లాం. ఈ సినిమాలో భాగంగా కొందరు పోలీసులను కలిశాను. వారి కథలు నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి.
- ఈ సినిమాలో నేను పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్ర చేశాను. నా కెరీర్‌లో ఎప్పుడూ చేయనటువంటి కొన్ని కొత్త యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా కోసం చేశాం. కథ రీత్యా ఈ తరహా యాక్షన్ సీక్వెన్స్‌లు అవసరం అయ్యాయి. అయితే కొన్ని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం కొంత రిహార్సల్స్ చేశాం. ఈ సినిమాలోని వాటర్ సీక్వెన్స్ కోసం మూడు రోజులు రిహార్సల్స్ చేసి, దాదాపు 15 రోజులు షూట్ చేశాం. ఈ ఎపిసోడ్ ఓ హైలైట్‌గా ఉంటుంది.
- సినిమా మొదలైన తొలి ఇరవై నిమిషాలు కూల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే స్క్రీన్‌పైకి అరవింద్ స్వామిగారు వస్తారో అప్పట్నుంచి స్టోరీ మలుపు తీసుకుని ఆడియన్స్‌ను స్క్రీన్‌పై నుంచి చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్, అరవింద్ స్వామి, ప్రియమణి వంటి సీనియర్స్ నటించారు. వారి నుంచి నేను కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఇచ్చిన డైలాగ్స్‌ను తనదైన శైల్లో ఇంప్రూవ్ చేసి చెబుతుంటారు అరవింద్ స్వామి గారు. ఇది నాకు చాలా కొత్తగా అనిపించింది. వెంకట్‌గారు ఏ స్క్రిప్ట్ అయితే నాకు చెప్పారో అదే తీశారు. ఆయన స్క్రీన్‌ప్లే స్టయిల్ తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది. ఈ చిత్రంలో కమర్షియల్ ఎలిమెంట్స్ స్టోరీకి తగ్గట్లుగానే ఉంటాయి. ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అవుట్‌పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నాను. పోలీస్ బ్యాక్‌డ్రాప్ సినిమాల్లో నాకు ‘ఘర్షణ’, నాన్నగారి ‘శివమణి’, ‘జేమ్స్ బాండ్’ యాక్షన్ ఫ్రాంచైజీ చిత్రాలు ఇష్టం.
- నిర్మాత శ్రీనివాసా చిట్టూరిగారు సెట్స్‌లో కూల్‌గా ఉంటారు. ‘కస్టడీ’ నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించబడింది. ఈ సినిమా 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. ఇళయరాజాగారు, యువన్ శంకర్‌రాజాగార్లు ఇచ్చిన మ్యూజిక్ ‘కస్టడీ’కి ప్లస్. ‘కస్టడీ’ని వేరే సినిమాతో పోల్చవద్దు. ‘కస్టడీ’ చిత్రం ‘కస్టడీ’యే.
- నేను తెలుగు డబ్బింగ్ కోసం దాదాపు పది రోజులు తీసుకుంటాను. కానీ తమిళ ‘కస్టడీ’ సినిమాకు డబ్బింగ్ పూర్తి చేయడానికి నెలరోజుల టైమ్ పట్టింది. నా సొంత వాయిస్ అయితే ఆడియన్స్‌కు యాక్టర్‌గా చేరువ కావొచ్చు. మన పెర్ఫార్మెన్స్ కూడా మెరుగ్గా కనిపిస్తుంది. అందుకే తమిళంలో డబ్బింగ్ చెప్పాను.
- నేను ఫలానా రకమైన సినిమాలు చేస్తేనే ఆడియన్స్‌కు నచ్చుతాయని అదే ట్రాక్‌లోకి వెళితే ఓ యాక్టర్‌గా అది నా బలహీనత అవుతుంది. ఈ విషయంలో నన్ను నేను కన్విన్స్ చేసుకోలేను. గతంలో నేను చేసిన కొన్ని లవ్‌స్టోరీలు వర్కౌట్ అయ్యాయి. అలా అని అవే సినిమాలు చేస్తుంటే ఓ యాక్టర్‌గా ఎదగలేను. చైతన్య ఎలాంటి సబ్జెక్ట్ అయినా బాగా చేస్తాడని ఆడియన్స్‌తో అనిపించుకోవాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులకు ఏ రకమైన సినిమాలు నచ్చుతున్నాయో తెలుసుకోవడం చాలెంజ్‌లా మారింది. కానీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా ఇస్తే వారి ఆదరణ ఓ రేంజ్‌లో ఉంటుంది.
- నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి త్వరలో అధికారికంగా చెబుతాను. ‘ధూత’ వెబ్ సిరీస్ రిలీజ్ అమెజాన్ చేతిలో ఉంది. ఈ ఏడాదే స్ట్రీమింగ్ స్టార్ట్ కావొచ్చు.

మా తాతగారు, నాన్నగారు గొప్ప గొప్ప సినిమాలు చేశారు. కొన్ని స్టాండర్డ్స్ క్రియేట్ చేశారు. కొందరు వారితో మాకు పోలికలు పెడుతుంటారు. అయితే ఈ విషయాన్ని నేను ఓ ప్రెజర్‌లా తీసుకోను. చాలెంజ్‌లా స్వీకరించి, నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఆ స్థాయికి నేను రీచ్ అవుతానా? లేదా అనేది నాకు తెలియదు. కానీ నా శక్తివంచన లేకుండా కష్టపడుతూనే ఉంటాను.


నా గురించిన కొన్ని వార్తలు వస్తూనే ఉన్నాయి (విడాకుల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ..). డిఫరెంట్ వార్తలు రాస్తున్నారు. కానీ ఆడియన్స్ ఫూల్స్ కాదు. తెలివైనవారు. ఏది జెన్యూన్ న్యూస్.. ఏది కాదనేది వారికి తెలుసని అనుకుంటున్నాను. నేను అయితే నవ్వుకుని వదిలేస్తున్నాను.

గేమ్ స్టార్ట్


● అదాశర్మ

‘ది కేరళ స్టోరీ’ వంటి వివాదాత్మక సినిమా తర్వాత హీరోయిన్ అదా శర్మ ఓ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ‘హేట్ స్టోరీ 2’ ఫేమ్ విశాల్ పాండ్య దర్శకత్వంలో శ్రేయాస్ తల్పాడే హీరోగా నటిస్తున్న చిత్రం ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’. ఈ చిత్రంలో అదా శర్మ నటిస్తున్నట్లు చిత్రయూనిట్ గురువారం ప్రకటించింది. ఇటీవల కాలంలో యువతలో బాగా ప్రాచుర్యం పొందిన ‘బ్లూ వేల్ గేమ్’ (బ్లూ వేల్ ఛాలెంజ్) నేపథ్యంలో థ్రిల్లర్‌గా ఈ కథ సాగుతుంది. ఇందులో అదా శర్మ పోలీస్ పాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ‘‘గతంలో ‘కమాండో’ సినిమాలో భావనా రెడ్డి అనే పోలీస్ పాత్ర చేశాను. ఆ పాత్ర మంచి ప్రజాదరణ పొందింది. ఇప్పుడు ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’లో గాయత్రీ భార్గవ్ అనే పోలీస్ పాత్ర చేస్తున్నాను. నా పాత్ర సరదాగా, విభిన్నంగా ఉంటుంది’’ అన్నారు.

ఓ సరదా ప్రయాణం


● నాగశౌర్య

నాగశౌర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘రంగబలి’. ఈ చిత్రం ద్వారా పవన్ బాసంశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ‘రంగబలి’ని జూలై 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. నాగశౌర్య ట్రెండీ గెటప్‌లో కనిపిస్తున్న ఓ పోస్టర్ ద్వారా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ‘‘పల్లెటూరి నేపథ్యంలో సాగే కథతో ‘రంగబలి’ ఫన్ రైడ్ (సరదా ప్రయాణం) గా ఉండబోతోంది. ఇందులో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.. ఇందుకు ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే తెలియజేస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్ మణి.

ప్రపంచంలో జరుగుతున్నదే మళ్ళీ పెళ్లిలో చూపిస్తున్నాం
- వీకే నరేశ్


● నరేశ్, పవిత్రా లోకేశ్, ఎమ్ఎస్ రాజు

‘‘ఓ మనిషి చావు చివరి దశలో ఉన్నప్పుడు చేయాల్సిన పనులు ఏవైనా మిగిలి ఉన్నాయా? ఏమైనా ప్రదేశాలను చూడాలనుకుని చూడలేక పోయామా? మనవల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందా? అనే మూడు అంశాల గురించి ఓసారి ఆలోచిస్తాడు. కానీ ఏ మనిషి జీవితంలో అయినా ఈ మూడు ఆశలు తీరనవిగా ఉండకూడదు. ఇదే ‘మళ్ళీ పెళ్లి’ సినిమా బేసిక్ కాన్సెప్ట్’’ అన్నారు నటుడు వీకే నరేశ్. ఎమ్ఎస్. రాజు దర్శకత్వంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘మళ్ళీ పెళ్లి’. విజయకృష్ణా మూవీస్ పతాకంపై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో విజయకృష్ణా మూవీస్ లోగోను వీకే నరేశ్, పవిత్రాలు రీ లాంచ్ చేశారు. ఎమ్ఎస్ రాజు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వీకే నరేశ్ మాట్లాడుతూ– ‘‘ప్రపంచంలో జరుగుతున్న అంశాలనే ఈ చిత్రంలో బోల్డ్‌గా చూపించాం. ఇది నా జీవితానికి సంబంధించిన సబ్జెక్ట్ కాదు’’ అని అన్నారు. ‘‘సినిమాలో ఉన్నట్లే జీవితంలో కూడా ఫస్టాఫ్, సెకండాఫ్ ఉంటాయి. ఎవరైనా సెకండాఫ్ చాలా బాగుండాలని కోరుకుంటారు.. అదే ‘మళ్ళీ పెళ్లి’ కాన్సెప్ట్. ఆడియన్స్‌ను చీట్ చేయడం లేదు. తప్పుని తప్పుగానే చూపిస్తున్నాం.’’ అన్నారు ఎమ్ఎస్ రాజు. ‘‘ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు ఎమ్ఎస్ రాజుగారి నుంచి చాలా నేర్చుకున్నాను’’ అన్నారు పవిత్రా లోకేశ్. ఈ కార్యక్రమంలో సంగీతదర్శకులు సురేష్ బొబ్బిలి, అరుల్‌దేవ్, ఎడిటర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ ఘటనతో...


● నిష్మా, ఇషాన్, శక్తి

ఇషాన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘అంతం కాదిది ఆరంభం’. శక్తి మహేంద్రా, నిష్మా, ప్రణాళి హీరోయిన్స్. ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ దశరథ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. తమని ట్రాప్ చేసి, నగ్న వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు? అనేదే ఈ చిత్రకథ’’ అన్నారు. సిరాజ్ మాట్లాడుతూ– ‘‘ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలతో ఇషాన్ ఈ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించాడు’’ అన్నారు. సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య, రచయిత రాంబాబు గోసాల, షేర్ స్టూడియో అధినేత దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: టి. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కత్రి మోహన్.

హ్యాపీ ఎండింగ్


● యశ్ పూరి

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా నటించిన చిత్రం ‘హ్యాపీ ఎండింగ్’. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో హామ్స్ టెక్ ఫిల్మ్స్, సిల్లీ మాంక్స్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ‘‘అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా ఉంటుంది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. అజయ్ ఘోష్, విష్ణు ఓయ్, ఝాన్సీ, అనిత చౌదరి, హర్ష రోషన్, జియా శర్మ నటించిన ఈ సినిమాకు సంగీతం: రవి నిడమర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ రామానుజం.

హీరో ఆఫ్ ఇండియా!


● అంకిత, కిషోర్

కిషోర్ తేజ, అంకిత మూలేర్ జంటగా ఆకుల రాఘవ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘హీరో ఆఫ్ ఇండియా’. తుమ్మలపల్లి రామసత్య నారాయణ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ లాంచ్ చేశారు. జె. భానుప్రసాద్ స్వరపరచిన మొదటి పాటని తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, రెండో పాటని నిర్మాత సాయి వెంకట్ లాంచ్ చేశారు. ‘‘తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, అమెరికాలోనూ మా సినిమాను రిలీజ్ చేస్తున్నందుకు హ్యాపీ’’ అన్నారు తుమ్మలపల్లి రామసత్యనారాయణ.